గన్నేరువరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వినోద్ కుమార్ సతీమణి డా.మాధవి

వినోద్ కుమార్‌తోనే సమస్యలకు పరిష్కారం

- ఉపాధి హామీ ప్రదేశాల్లో డా. మాధవి ప్రచారం

గన్నేరువరం, ఏప్రిల్ 22: ఉపాధి హామీ కూలీల సమస్యలు శాశ్వతంగా పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన సతీమణి డాక్టర్ మాధవి కోరారు. సోమవారం మండలంలోని గన్నేరువరం, పారువెల్ల, ఖాసీంపేట, జంగపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎంపీగా బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఆరు గ్యారెంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, 100 రోజులు దాటినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. అభివృద్ధి చేసే నాయకుడైన బోయినపల్లి వినోద్ కుమార్‌ను కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. అంతకుముందు ఖాసీంపేట మానసాదేవి ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంప వెంకన్న, నాయకులు ఆంజనేయులు, మోహన్ రెడ్డి, న్యాత సుధాకర్, పుల్లెల లక్ష్మణ్, తిరుపతి రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెర్లభూత్కూర్‌లో ప్రత్యేక పూజలు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 22: చెర్లభూత్కూర్‌లోని మంగళగిరి పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శకటోత్సవానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ మాధవి హాజరయ్యారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడే ఉన్న యువకులతో డా. మాధవి మాట్లాడారు. యువతకు వివిధ రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటుకు వినోద్‌కుమార్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి, వినోద్‌కుమార్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, కూర శ్యాంసుందర్‌రెడ్డి, చింతల లక్ష్మణ్, బుర్ర తిరుపతి, మాసగోని రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుని ఇంటికి వెళ్తుండగా..

కల్వర్ట్ కిందకు దూసుకెళ్లిన కారు

- కల్వర్టు కిందకు దూసుకెళ్లిన వధూవరుల కారు
- వరుడి తల్లి, వధువు సోదరికి తీవ్రగాయాలు
- స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడిన ముగ్గురు
- గట్టుదుద్దెనపల్లి వద్ద ఘటన

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 22: ఆలయంలో పెళ్లి చేసుకున్న నూతన జంట కుటుంబంతో కలిసి ప్రయాణిస్తున్న కారు కల్వర్టు కిందకు దూసుకెళ్లిన ఘటన మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి శివారులో జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మానకొండూర్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన రిటైర్డ్ ఎస్ఐ దామెర సురేందర్, కౌసల్య దంపతుల కుమారుడి వివాహం ఆదివారం వేములవాడలో జరిగింది. సోమవారం మధ్యాహ్నం వధూవరులు దామెర తిలక్, స్వాతి, వరుడి తల్లిదండ్రులతోపాటు వధువు చెల్లి విద్య ఐదుగురు కారులో హనుమకొండకు తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన కల్వర్టు నిర్మాణం వద్ద కారు అదుపుతప్పింది. కల్వర్టు కిందకు కారు దూసుకెళ్లడంతో వధూవరులతో పాటు సురేందర్, కౌసల్య, విద్య వాహనంలోనే ఇరుక్కుపోయారు. వెంటనే స్థానికులు పోలీసులకు, 108 వాహనానికి సమాచారం అందించారు. సహాయక చర్యలు చేపట్టి కారు నడుపుతున్న తిలక్‌తోపాటు మిగతా వారందరినీ బయటకు తీశారు. ప్రమాదంలో కౌసల్య, విద్యకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, వారందరినీ కేశవపట్నం 108 వాహనంలో ఈఎంటీ శ్రీధర్, పైలట్ గోపీకృష్ణ కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ సీఐ రాజ్ కుమార్ తెలిపారు.

రేపటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 22 : 2023-24 విద్యాసంవత్సరానికి పాఠశాలలకు మంగళవారం ఆఖరు పనిదినమని, బుధవారం నుంచి వేసవి సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రావు పేర్కొన్నారు. తిరిగి 2024 - 25 విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. అయితే, సోమవారంతో సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు ముగియగా, రాష్ట్ర విద్యాశాఖ నుంచి వెలువడిన ఉత్తర్వుల మేరకు సెలవులు ప్రకటిస్తున్నట్లు డీఈవో తెలిపారు. జూన్ 12న బడులు తిరిగి తెరుచుకుంటాయి.

రేపు ఇంటర్ ఫలితాలు

24వ తేదీన ఇంటర్ ఫలితాలు విడుదల కానున్నాయి. ఉదయం 11 గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు తెలిపింది. ఫలితాల విషయంలో సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.

గుకేష్ ఎంపికపై సంబురాలు

కొత్తపల్లి, ఏప్రిల్ 22 : ఫిడే కాండిడేట్ టోర్నీలో విజేతగా నిలిచి అంతర్జాతీయ చదరంగ పోటీలకు గుకేష్ అర్హత సాధించడంపై తెలంగాణ చెస్ డెమోక్రటిక్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం సంబరాలు జరుపుకొన్నారు. గీతా భవన్ చౌరస్తాలో పటాకులు కాల్చి, స్వీట్లు పంచారు. ఈసందర్భంగా అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కంకటి అనూప్‌కుమార్ మాట్లాడుతూ, తెలంగాణకు చెందిన చదరంగ క్రీడాకారుడు గుకేష్ అంతర్జాతీయ చదరంగం పోటీలో ఎంపికైనందుకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్, ఉపాధ్యక్షుడు వీ అనుష్ కుమార్, జాయింట్ సెక్రటరీలు కంకటి సృజన్, సతీశ్‌బాబు, కె. రాజ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కొత్తపల్లి, ఏప్రిల్ 22 : జిల్లా టేబుల్ టెన్నిస్ నూతన కార్యవర్గాన్ని సోమవారం నగరంలోని జీఎస్ అకాడమీలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ శరత్‌కుమార్‌రెడ్డి (రాఘవేంద్ర హాస్పిటల్), ఉపాధ్యక్షులుగా బీ శ్రీధర్‌గౌడ్, బీ మహేశ్, ఎన్ మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా సర్దార్ సురేందర్‌సింగ్, సంయుక్త కార్యదర్శిగా ఎం వికాస్‌కుమార్, కోశాధికారిగా డీ గౌతం రెడ్డి, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా ఎం సంతోష్, జీ శ్రీహర్ష, ఎల్ శ్రీకరాచారి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన బాధ్యులు టేబుల్ టెన్నిస్ క్రీడకు పూర్వవైభవం తీసుకువస్తామని, జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగేలా శిక్షణ అందజేస్తామన్నారు. నూతన సభ్యులకు క్రీడా సంఘాల బాధ్యులు అభినందనలు తెలిపారు.

నివేశ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నివేశ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, నాయకులు

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్22: పట్టణానికి చెందిన ప్రముఖ డాక్టర్ కృష్ణమూర్తి మనుమడు, డాక్టర్ నవీన్- డాక్టర్ స్వాతి కుమారుడు ముక్క నివేశ్ ఆదివారం అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, కుటుంబ సభ్యులను సోమవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కలిసి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, జడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, కేడీసీసీబీ వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, ఎంపీపీ ఇరుమల్ల రాణీసురేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత వీ రవీందర్‌రావు ఉన్నారు.

ఆదాయం పెంపుపై బల్దియా దృష్టి

కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయం

- వేగంగా విస్తరిస్తున్న నగరం
- మౌలిక వసతుల కల్పనకు పెరుగుతున్న వ్యయం
- లోపాలను గుర్తించడంలో నిమగ్నమైన అధికార యంత్రాంగం
- నగరంలో నూతన నిర్మాణాల మదింపు ప్రారంభం

ఏటా విస్తరిస్తున్న నగరంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు వ్యయం పెరుగుతున్నది. బల్దియాకు ఆస్తి, తదితర పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయ వృద్ధిలో మాత్రం ప్రగతి లోపించింది. అధికారుల నిర్లక్ష్యం, అవకతవకల వల్లే ఈ పరిస్థితి నెలకొన్నదనే విమర్శలు వ్యక్తమవుతున్న క్రమంలో కమిషనర్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం లోపాలను గుర్తించడంలో నిమగ్నమైంది. ఇందులో భాగంగా నూతన నిర్మాణాల మదింపునకు క్షేత్ర స్థాయి బాట పట్టింది.

-కార్పొరేషన్, ఏప్రిల్ 22

నగరపాలక సంస్థకు ఆస్తి, నల్లా పన్నులు, అడ్వర్‌టైజింగ్, ట్రేడ్ లైసెన్స్, వాణిజ్య సముదాయాల అద్దె రూపంలో, పారిశుధ్య విభాగం యూజర్ చార్జీల ద్వారా ఆదాయం వస్తుంది. వీటిల్లో ముఖ్యంగా ఆస్తి పన్నుల ద్వారానే భారీగా ఆదాయం సమకూరుతుంది. అలాగే నగరపాలక సంస్థ పారిశుధ్య పనులు, నీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ తదితర పనుల కోసం భారీగానే వెచ్చిస్తున్నది. వీటిల్లో ముఖ్యంగా పారిశుధ్యంపై భారీగా వ్యయం అవుతుండగా.. నీటి సరఫరా, వీధి దీపాలకు సంబంధించి విద్యుత్ బిల్లులు కూడా ఇటీవల కాలంలో భారీగానే పెరిగాయి. అయితే ఈ మేరకు బల్దియా ఆదాయం పెరుగడం లేదన్న వాదనలు వస్తున్నాయి. నగరంలో పెద్ద సంఖ్యలో నూతన కాలనీల ఏర్పాటవుతున్నాయి. అయితే వాటికి పూర్తిస్థాయిలో ఆస్తి పన్ను మదింపు విషయంలో రెవెన్యూ విభాగం అధికారులు నిర్లక్ష్యం, చేతివాటంతో ఆదాయం తక్కువగా వస్తున్నదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో నగరంలో ఆస్తి పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

నగరంలో నూతన నిర్మాణాల మదింపు

నగరపాలక సంస్థ పరిధిలో ఏటా పెద్ద సంఖ్యలోనే నూతన భవన నిర్మాణాలు సాగుతున్నాయి. అయితే వీటన్నింటినీ పూర్తిస్థాయిలో కొలతలు వేసి ఆస్తి పన్ను నిర్ధారణ చేసే విషయంలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. వీటితో పాటు గతంలో నిర్మాణం చేసిన భవనాల్లో కూడా అదనపు నిర్మాణాలు సాగిస్తున్నాయి. అయితే ఇలాంటి నిర్మాణాల వైపు అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అలాగే నగరపాలక సంస్థలోని రెవెన్యూ అధికారులు ఎక్కువగా నూతన ఇంటి నంబర్లు కేటాయింపు, పన్నుల విధింపునకే పరిమితమవుతున్నారు. గతంలో ఇంటి నంబర్ తీసుకొని నూతనంగా అదనపు నిర్మాణాలు చేపడుతున్నా, గతంలో గృహావసరాలకు అనుమతి పొందిన భవనాలను ప్రస్తుతం కమర్షియల్‌గా వినియోగిస్తున్నా వాటి ఆస్తి పన్నుల మదింపు మాత్రం పట్టించుకోవడం లేదు. వీటిపై ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. నూతన నిర్మాణాలతో పాటు, పాత భవనాల్లో అదనపు నిర్మాణాలపై కూడా దృష్టి పెట్టి ఆస్తి పన్నులను మదింపు చేయాలని ఇటీవల నగర కమిషనర్ శ్రీనివాస్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ చర్యలు చేపట్టారు. ఇప్పటికే రాంనగర్, మంకమ్మతోట, సంతోష్‌నగర్ ప్రాంతాల్లో నిర్మాణాల కొలతలు తీయడం ప్రారంభించారు. అయితే ముఖ్యంగా ఇటీవల నగరంలో విలీనమైన ప్రాంతాలు, శివారుల్లో నూతనంగా వెలుస్తున్న కాలనీల్లో భవన నిర్మాణాలకు ఇంటి నంబర్ కేటాయించే విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే నగరంలో ప్రధాన ప్రాంతాల్లో గృహావసరాల కోసం అనుమతి పొందిన అనేక భవనాలను ప్రస్తుతం పూర్తిగా కమర్షియల్‌గానే వినియోగిస్తున్నారు. వీటిపై కూడా అధికారులు దృష్టి సారిస్తే బల్దియా ఆదాయం పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

'విద్య కాషాయీకరణకు బీజేపీ కుట్రలు'

తెలంగాణచౌక్, ఏప్రిల్ 22: దేశంలో విద్యా వ్యవస్థను కాషాయీకరణ చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి ఆరోపించారు. విద్యార్థి, నిరుద్యోగులను విస్మరించిన బీజేపీని ఓడించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రచురించిన పోస్టర్‌ను సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవనంలో జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ ఏటా కోటి ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. మతం పేరుతో యువతను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నదని మండిపడ్డారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ విద్యారంగానికి కేంద్రం నుంచి తీసుకొచ్చిన నిధులు ఏమీలేవన్నారు. ఆయన నిర్లక్ష్యం వల్లే జిల్లాకు రావలసిన ట్రిపుల్ ఐటీ మరో రాష్ట్రానికి తరలిపోయిందన్నారు. దేశాన్ని విభజించి పాలిస్తున్న బీజేపీ మరోసారి అధికారంలోకి రాకుండా విద్యార్థులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, నాయకులు హేమంత్, రాజేశ్, వినయ్‌రెడ్డి, శ్రవణ్, సాయి, సచిన్ పాల్గొన్నారు.

నాలుగో రోజు నామినేషన్ల వెల్లువ

రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అభ్యర్థి రాజేందర్‌రావు, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 22 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ స్థానాలకు నామినేషన్లు వెల్లువెత్తాయి. కరీంనగర్‌లో 13 మంది 17 సెట్లు, పెద్దపల్లిలో 14 మంది, నిజామాబాద్‌లో 12 మంది నామినేషన్లు వేశారు. కరీంనగర్‌లో దేవునూరి శ్రీనివాస్, బంక రాజు, అబ్బుడి బుచ్చిరెడ్డి, గవ్వల లక్ష్మి, జింక శ్రీనివాస్, ఎండీ జిషాన్ స్వతంత్రులుగా, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి చింత అనిల్ కుమార్, ఆధార్‌పార్టీ నుంచి తాళ్లపల్లి అరుణ, సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి గట్టు రాణాప్రతాప్, ధర్మసమాజ్ పార్టీ నుంచి చిలువేరు శ్రీకాంత్, కాంగ్రెస్ నుంచి వెలిచాల రాజేందర్‌రావు, ఎంసీపీఐ నుంచి లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి అందజేశారు. వీరిలో రాజేందర్ రావు నాలుగు సెట్లు, బంక రాజు రెండు సెట్ల చొప్పున వేశారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే చట్టపరంగా చర్యలు

- నగరపాలక కమిషనర్ శ్రీనివాస్
- టిఫిన్ సెంటర్లలో తనిఖీలు

అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ శ్రీనివాస్

కార్పొరేషన్, ఏప్రిల్ 22: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని టిఫిన్ సెంటర్ నిర్వాహకులు ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పలు టిఫిన్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ప్లాస్టిక్ ప్లేట్స్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న టిఫిన్ సెంటర్ల నిర్వాహకులను గుర్తించి వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించామని, టిఫిన్ సెంటర్లలో స్టీల్స్ లేదా అరటి ఆకులను వినియోగించాలని సూచించారు. ఈ విషయంలో మొదటగా జరిమానాలు విధిస్తున్నామని, అనంతరం చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన పెంచాలి

నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన పెంచేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ప్లాస్టిక్ నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో ఎక్కడా కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మకుండా, వినియోగించకుండా చూడాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బల్దియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశాలు వాయిదా

కొత్తపల్లి, ఏప్రిల్ 22 : మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. కొత్తపల్లి మండలానికి సంబంధించిన సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేయగా, సమావేశం నిర్వహణకు అవసరమైన మేర సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీపీ పిల్లి శ్రీలతామహేశ్ ప్రకటించారు. ఎంపీడీవో ప్రభు, ఏపీవో స్పందన, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సాబీర్, ఎంపీటీసీ దావ కమల మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 22: ఎన్నికల కోడ్ దృష్ట్యా కరీంనగర్ మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం కోసం హాజరైన ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఎంపీటీసీ సాయిల వినయ్‌కుమార్ తదితరులు పాల్గొనగా, ప్రత్యేకాధికారులు గైర్హాజరయ్యారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తిమ్మాపూర్, ఏప్రిల్ 22: రామకృష్ణ కాలనీ గ్రామానికి చెందిన కిన్నెర పెద్ద రాజారాం ఇటీవల మరణించగా, అతడి కుటుంబ సభ్యులను గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడు దావ సంపత్ రెడ్డి పరామర్శించారు. రూ.10వేల సాయం అందజేశారు. ఇక్కడ మాచర్ల అంజయ్య, సంపత్, కిన్నెర అంజి తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

బొమ్మనపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో ఉప్పల శ్రీధర్

చిగురుమామిడి, ఏప్రిల్ 22: ఎండ తీవ్రత దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సదుపాయాలను కల్పించాలని డీఆర్డీవో ఉప్పల శ్రీధర్ ఆదేశించారు. మండలంలోని చిగురుమామిడి, బొమ్మనపల్లి గ్రామాల్లోని సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల ధాన్యం కొనుగోలు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం అందించే కనీస మద్దతు ధరను ప్రతి రైతు పొందాలన్నారు. ఆయన వెంట డీపీఎం ప్రవీణ్, ఏపీఎంలు మట్టేల సంపత్, రాజేశ్, సీసీలు వెంకటమల్లు, సత్యనారాయణ, కమిటీ సభ్యులు రజిత, నిర్మల, చైతన్య, రైతులు ఉన్నారు.

హిమ్మత్‌నగర్‌లో కేంద్ర బలగాల కవాతు

వీణవంక, ఏప్రిల్ 22: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో సోమవారం కేంద్ర బలగాల కవాతు నిర్వహించారు. గ్రామంలోని చౌరస్తాలో జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, వీణవంక ఎస్ఐ తోట తిరుపతి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర బలగాలతోపాటు స్థానిక పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌కు కూలర్ వితరణ

కూలర్ అందిస్తున్న దాతలు

విద్యానగర్, ఏప్రిల్ 22 : కరీంనగర్‌లోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో గల మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి సోమవారం కూలర్ వితరణ చేశారు. రేణికుంట ఎంపీటీసీ ల్యాగల వీరారెడ్డి తండ్రి తిరుమలరెడ్డి జ్ఞాపకార్థం, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తండ్రి లక్ష్మీరాజం జ్ఞాపకార్థం రూ.35 వేల విలువైన కూలర్‌ను దవాఖాన సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఫిజీషియన్ వైద్యురాలు డాక్టర్ నవీనకు అందించారు.

'బీసీల ఐక్యతను చాటుదాం'

తెలంగాణచౌక్, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ ఐక్యతను చాటుదామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి పటేల్ పిలుపునిచ్చారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీ వాటా దక్కడం లేదన్నారు. వాటి సాధన కోసం ఈ నెల 25న పార్లమెంట్ ఎన్నికల కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ నాయకులు అజయ్‌పటేల్, వేణుగోపాల్, ఆంజనేయులు, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

వాహన తనిఖీల్లో రూ.15లక్షల పట్టివేత

జమ్మికుంట, ఏప్రిల్ 22: ఎన్నికల నియమావళిలో భాగంగా టౌన్ సీఐ వీ రవి ఆధ్వర్యంలో పోలీసుల తనిఖీలో ఒక వ్యక్తి వద్ద రూ.15లక్షల నగదు పట్టుకున్నారు. జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌లో హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. జమ్మికుంటలోని గ్రేన్ మార్కెట్ ఏరియాలో సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన పొనగంటి సురేశ్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా రూ.15లక్షలున్నాయి. వాటి వివరాలు సురేశ్ వెల్లడించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నగదును సంబంధిత శాఖాధికారులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రూ.50వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లకూడదని, తనిఖీల్లో సీజ్ చేస్తామని తెలిపారు. ఇక్కడ సీఐ రవి, ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

అడ్వకేట్ జనరల్‌ను కలిసిన బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్


అడ్వకేట్ జనరల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజ్‌కుమార్

కోర్టుచౌరస్తా, ఏప్రిల్ 22 : రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ బీ సుదర్శన్ రెడ్డిని కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్ కుమార్ రాష్ట్ర హైకోర్టులో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తెలంగాణ న్యాయవాదుల వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్‌గా సైతం కొనసాగుతున్న ఆయనకు, తెలంగాణ న్యాయవాదుల వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యుడిగా రాజ్ కుమార్ పలు విజ్ఞప్తులు చేశారు. న్యాయవాదులకు ప్రస్తుతం ఉన్న రూ.2 లక్షల ఇన్సూరెన్స్‌ను రూ.5 లక్షలకు పెంచాలని, కొత్త సభ్యులకు హెల్త్ క